# మండుతున్న ఎండలు

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు
- 12 దాటితే రోడ్లన్నీ నిర్మానుష్యం
- జిల్లాలో 43.5 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు

**రోజురోజుకూ** భూతాపం పెరిగిపోతున్నది. రానున్నరోజుల్లో ఎండ తీవ్రత ఇంకా ఎలా ఉంటుందో అని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రజలు ఉదయం 11 గంటలు దాటితే చాలు ఇంటి నుంచి బయటికి రావడానికి జంకుతున్నారు. ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఈ పరిస్థితుల్లో తగు జాగ్రత్తలు తీసుకోకపోతే ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



కామారెడ్డిలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు



కామారెడ్డి, మే 2 : వారం రోజుల నుంచి జిల్లాలో ఎండ తీవ్రత విపరీతంగా పెరిగింది. జిల్లాలో కనిష్ఠ 41.8, గరిష్ఠం 43.5 డిగ్రీలుగా ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. చెమట, ఉక్కపోతతో జనాలు అల్లాడుతున్నారు. శీతల పానీయలు, కొబ్బరిబొండాలు, చెరుకు రసం, ఇతర పండ్ల రసాలు, కూల్ డ్రింక్స్ దుకాణాల విక్రయాలు పెరిగాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపు తున్నాడు. 12 దాటిందంటే రోడ్ల న్నీ నిర్మానుష్యంగా మారుతు న్నా యి. సాధ్యమైనంత వరకు 12 నుంచి 4 గంట ల వరకు బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

### బయటికి వెళ్లేటప్పుడు చేయకూడని పనులు..

- ఎండలో బయటికి వెళ్లేటప్పుడు నల్లని దుస్తులు, మందమైన దుస్తులు ధరించకూడదు.
- ఎండలో నుంచి ఇంటికి రాగానే తీపి పదార్థాలు తీసుకోకూడదు.
- అతి చల్లటి పదార్థాలు తీసుకోకూడదు.
- వీలైనంత వరకు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటికి వెళ్లకుండా చూసుకోవాలి. ఒక వేళ బయటికి వెళ్లాల్సివస్తే గొడుగు తీసుకెళ్లాలి

### వేసవిలో ఎండ దెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవాలి

వేసవి కాలం వచ్చిందంటే ఎండ దెబ్బ తగలకుండా తగు చర్యలు తీసుకోవాలి. చిన్న పిల్లలకు 2, 3 గ్లాసుల నీళ్లు తాగించాలి. ఒక వేళ వడ దెబ్బ తగిలితే వెంటనే దవాఖానలో చేర్పించి ప్రథమ చికిత్స చేయించాలి. ఉప్పు కలిపిన నీరు, కొబ్బరి నీళ్లు, నిమ్మ రసం, పుచ్చకాయ రసం, మజ్జిగను ఎక్కువ మోతాదులో తీసుకోవాలి.

**- డాక్టర్ ఫరీదా (జిల్లా దవాఖాన సూపరింటెండెంట్)**



విక్రయానికి సిద్ధంగా కుండలు



చెరుకు రసం తాగేందుకు వచ్చిన జనం

### వేసవిలో ఎండ దెబ్బ తట్టుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

వేసవిలో శరీరంలో ఫ్లూయిడ్ లెవల్స్ పడిపోకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఫ్లూయిడ్ లెవల్స్ తగ్గిపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఎక్కువ మోతాదులో నీళ్లు, పండ్ల రసాలు తీసుకోవాలి. గంటకు 2, 3 గ్లాసుల నీరు తీసుకోవాలి. పుచ్చకాయ రసం, బార్లీ జావలో పటికబెల్లం, కొబ్బరి నీళ్లు తాగాలి. మజ్జిగ, నిమ్మరసం, చెరుకు రసం, తేలికగా జీర్ణం అయ్యే పదార్థాలను తీసుకోవాలి. అల్కహాల్, కాఫీ వంటి పానీయాలకు దూరంగా ఉండడం మంచిది. ముఖ్యంగా పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. షుగర్ రోగులు ఎండల్లో బయటికి వెళ్లినా.. వేడి ప్రదేశాల్లో ఉన్నా షుగర్ పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలి.

## బాన్సువాడ ఎంపీడీవోగా ముజాహిద్

బాన్సువాడ రూరల్, మే 2 : బాన్సువాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎం.డీ ముజాహిద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంపీడీవోగా పని చేసిన బషీరుద్దీన్ ఇటీవలే ఉద్యోగ విమరణ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఎం.డీ ముజాహిద్‌ను ఎంపీడీవోగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులతో కలిసి పని చేస్తానని ఆయన తెలిపారు.

## 5 నుంచి వేసవి శిక్షణా శిబిరాలు

కామారెడ్డి, మే 2 : సమగ్ర శిక్షణ తెలంగాణ ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు వసతితో కూడిన జిల్లా స్థాయి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సమ్మర్ క్యాంపు కోఆర్డినేటర్ సుకన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ శిబిరం వంద మంది విద్యార్థినులతో నిర్వహించనున్నామని తెలిపారు. సంగీతం, నృత్యం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్ర లేఖనం, కంప్యూటర్ స్కిల్స్, ఆటలు, యోగా తదితర అంశాల్లో శిక్షణ పొందడానికి ఆసక్తి ఉన్న విద్యార్థినులు కేజీబీవీ టేక్రియాల్‌లో 5వ తేదీ ఉదయం 8 గంటల వరకు చేరుకోవాలని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ర్యాలీని విజయవంతం చేయాలి

కామారెడ్డి, మే 2 : హైదరాబాద్‌లో శనివారం నిర్వహించనున్న శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని పూర్వ విప్లవ విద్యార్థి ఉమ్మడి జిల్లా కన్వీనర్ విజయ రామరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొంత కాలంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఎన్‌కౌంటర్ల పేరుతో అమాయక ఆదివాసీలను హత్య చేస్తున్నారని, ఈ సమస్యకు శాంతి చర్చలే పరిష్కారమని ఇటు ప్రభుత్వాన్ని, అటు మావోయిస్టు పార్టీని చర్చలకు ముందుకురావాలని కోరుతూ ఈ నెల 3వ తేదీ హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ నుంచి ఇందిరాపార్క్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కూడా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఈ శాంతి ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితా ప్రదర్శన

బీబీపేట, ఏప్రిల్ 2 : బీబీపేట, దోమకొండ మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల జాబితాను శుక్రవారం ప్రదర్శించారు. మాందాపూర్, జనగామ, తుజాల్‌పూర్, యాడారం, సంగమేశ్వర్, ముత్యంపేట, అంచనూర్ తదితర గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ఎంపీడీవోలు పూర్ణ చంద్రోదయకుమార్, ప్రవీణ్‌కుమార్, ఎంపీవో అబ్బాగౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు కలిసి పంచాయతీ కార్యాలయాల్లో అర్హులైన లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శించారు. ఆయా గ్రామాల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, నాయకులు రాకేశ్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్‌గౌడ్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 5 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కామారెడ్డి, మే 2 : ఈ నెల 5 నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తు స్వీకరించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్‌తో కలిసి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్లతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జూన్ 2వ తేదీ వరకు పైలట్ ప్రాజెక్ట్ కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నీట్ పరీక్షా కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. భూభారతి పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలో లింగంపేట్ మండలంలో 23 గ్రామాల్లో ఏప్రిల్ 17 నుంచి 30 వరకు సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు విక్టర్, చందర్, ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, హౌసింగ్ పీడీ జైపాల్‌రెడ్డి, భూ భారతి ప్రత్యేకాధికారి రాజేందర్ రెడ్డి, ల్యాడ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు శ్రీనివాస్, లింగంపేట్ తహసీల్దార్ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అప్పును ఎగ్గొట్టేందుకే హత్య

- 48 గంటల్లోనే హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రాజేశ్ చంద్ర
- పాత నేరస్తుడి అరెస్ట్

కామారెడ్డి, మే 2 : కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో గత నెల 30వ తేదీన జరిగిన హత్య కేసును పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాజేశ్ చంద్ర వివరాలు వెల్లడించారు. గత నెల 30వ తేదీన కామారెడ్డి మండలం నర్సన్నపల్లి గ్రామంలో చిదుర కవిత (44)ను వ్యవసాయ భూమిలో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కామారెడ్డి ఏఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో ఒక బృందం ఏర్పడి సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దోమకొండ మండలం చింతామన్‌పల్లి గ్రామానికి చెందిన పాత నేరస్తుడైన మహేశ్‌ను అరెస్టు చేశారు. నిందితుడు మహేశ్‌పై భిక్కనూర్ పోలీసు స్టేషన్‌లో ఇదివరకే ఒక మర్డర్ కేసు నమోదై ఉంది. ఈ మర్డర్ కేసు విషయంలో బెయిల్ కోసం చిదుర కవిత వద్ద లక్ష రూపాయలు అప్పు తీసుకున్నాడు. ఆ డబ్బులు చెల్లించాలని కవిత అడగడంతో హత్య చేసేందుకు పథకం వేసుకున్నాడు. గత నెల 30వ తేదీన అప్పుగా తీసుకున్న డబ్బులు చెల్లిస్తానని చెప్పి కవితను ఆమె వ్యవసాయ భూమి వద్దకు రావాలని నమ్మించాడు. దీంతో కవిత వ్యవసాయ భూమి వద్దకు వచ్చింది. మహేశ్ పథకం ప్రకారం కవిత ముక్కుపై బలంగా చేతితో దాడి చేయడంతో కింద పడిపోయింది. వెంటనే ఆమె చీర కొంగుతో ఉరేసి హత్య చేశాడు. ఆమె ఒంటిపై ఉన్న బంగారు కమ్మలు, మాటీలు, వంకుంగరం, మొబైల్ ఫోన్‌ను చోరీ చేసి ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుంచి పారిపోయాడు. దర్యాప్తులో భాగంగా మహేశ్‌ను పట్టుకొని ఒక జత బంగారు కమ్మలు, ఒక జత బంగారు మాటీలు, ఒక బంగారు వంకుంగరం, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును 48 గంటల్లోగా ఛేదించిన కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, క్రైం టీం సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్

మద్నూర్, మే 2: డోంగ్లి మండలం సిర్పూర్ మంజీరా వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు గిర్దావర్ సాయిబాబా శుక్రవారం తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్‌ను మద్నూర్ పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతిరోజూ తనిఖీలు చేపడుతున్నామని, ఇసుకను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు

**ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్**

లింగంపేట, మే 2: గ్రామీణ ప్రాంతాల్లోని కల్లు దుకాణాల్లో కల్తీ కల్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దోమకొండ సర్కిల్ ఎక్సైజ్ సీఐ మధుసూదన్ ముస్తేదార్లను హెచ్చరించారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశాల మేరకు తాడ్వాయి మండల కేంద్రంలోని కల్లు దుకాణాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కల్తీ కల్లు, డ్రగ్స్, గంజాయి నిరోధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే 1908 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కల్తీ కల్లు విక్రయించొద్దని సూచిస్తూ కల్లు విక్రయదారులకు నోటీసులు జారీ అందజేశారు. సీఐ వెంట ఎస్సై దీపిక, సిబ్బంది ఉన్నారు.



ముస్తేదారుకు నోటీసు అందజేస్తున్న ఎక్సైజ్ ఎస్సై దీపిక

# మత్తమాల పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారి

ఎల్లారెడ్డి రూరల్, మే 2: మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అధికారులు తనిఖీలు చేపట్టారు. కాయకల్ప ఇంటర్నల్ ఎస్సెస్మెంట్‌లో భాగంగా బీర్కూర్ నుంచి వచ్చిన మెడికల్ ఆఫీసర్ గిరీశ్.. దవాఖాన చెక్‌లిస్టులోని విషయాలను పరిశీలించారు. అనంతరం రివ్యూ తీసుకున్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యుడు శరత్‌కుమార్, ఫార్మాసిస్ట్ రాథోడ్, ఏఎన్ఎం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

**NOTICE** is hereby given that Mrs. Gandra Umarani, W/o: Gandra Madhusudan Rao, R/o. Flat No.104, Siri Nilayam Apartment, Ashok Nagar, Kamareddy Town and District - 503111, offered to sell the property mentioned in the schedule hereunder, being the lawful owner, and our clients have agreed to buy the same and paid substantial amount to the Vendor towards part sale consideration and entered an agreement of sale.
**Schedule of Property:** All that agriculture land to an extent of Ac. 3.00 Guntas in Sy. No. 419/A1/1, situated at Kachapur Village of Bhikanoor Mandal, Kamareddy District and bounded by: North: Agri. Land of G. Rajaiah, South: Agri. Land of G. Pedda Balaiah, East: Agri. Land of G. Balaiah, and West: Road to Mohammadapoor.
Any person / persons claiming any interest, claim, right in the above-said property in whatsoever manner is / are hereby required to contact the undersigned, with material documents within 15 days from the date of publication of this notice, failing which the said sale transaction will be completed, and thereafter no claims will be considered.
Sd/- **BHASKAR MUTHYALA**
Advocate
**M/s. ADSUM LAW FIRM LLP**
#I04, 1st Floor, Priyanka Residency,
Adj. OUT Colony, Kapra,
Sainikpuri, Hyderabad - 500 094
**(M) 7093140121, 8978681100**

## నాయక్‌పోడ్ సర్టిఫికెట్లు ఇవ్వాలని వినతి



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న నాయకులు

నిజాంసాగర్, మే 2: నాయక్‌పోడ్(ఎస్టీ) సర్టిఫికెట్లు ఇవ్వాలని మహ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్‌ను ఆదివాసి నాయక్‌పోడ్ జిల్లా అధ్యక్షుడు మొట్ట పెంటయ్య కోరారు. తహసీల్దార్‌ను శుక్రవారం కలిసి సర్టిఫికెట్ల కోసం అడుగగా.. మీరు వలస వాదులు అని, మైగ్రేషన్ సర్టిఫికెట్ తీసుకురావాలని, లేదా కలెక్టర్ వద్దకు వెళ్లి కలువాలని అంటున్నాడని ఆయన వాపోయారు. సర్టిఫికెట్ లేకపోవడంతో తమ పిల్లలు ఉన్నత చదువులు, రిజర్వేషన్లకు దూరం అవుతారని ఆవేదన వ్యక్తంచేశారు. మండలస్థాయి అధికారులు అవగాహన లోపంతో, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పెంటయ్య తెలిపారు. కార్యక్రమంలో కాశీరాం, రవీందర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★ I, P.Kalyan S/o. P.Poshetty (Old Name) H.No.6-237, Street Chintakuntawada, Nirmal Town and Dist. T.S., India. Changed my name as PEDDOLLA KALYAN KUMAR (New name) S/o. PEDDOLLA POSHETTY.
NTZ - 336013

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

లింగంపేట(తాడ్వాయి), మే 2: తాడ్వాయి మండలంలోని చిట్యాల గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ నిర్మాణంతో చిట్యాల పరిసర గ్రామాల్లో లో వోల్టేజీ సమస్య తీరుతుందని తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.2.11కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. పనులు త్వరగా పూర్తి చేసి 14గ్రామాల విద్యుత్ సమస్యను దూరం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొత్తం ధాన్యం ప్రభుత్వమే కొంటుంది



ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏవో నవ్య

నిజాంసాగర్, మే 2: మహ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయాధికారిణి నవ్య శుక్రవారం సందర్శించారు. ప్రభుత్వం పూర్తిగా ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. కేంద్రంలో ఉన్న ధాన్యపు రాశులను పరిశీలించారు. ధాన్యం నిర్దేశిత తేమశాతం ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. ఆమె వెంట ఏఈవో మధుసూదన్, రైతులు దుర్గాప్రసాద్, బాలరాజ్, గణేశ్, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

## లారీ నుంచి పడిపోయిన బస్తాలు

ఎల్లారెడ్డి రూరల్, మే 2: ఎల్లారెడ్డిలో జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతుండంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీ నుంచి ధాన్యం సంచులు కింద పడ్డాయి. నిజాంసాగర్ నుంచి కామారెడ్డికి వెళ్తున్న ధాన్యం లారీ ఎల్లారెడ్డి డీఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకోగానే.. అక్కడ రోడ్డు పనులు జరుగుతుండడంతో కుదుపునకు గురైంది. దీంతో లారీలోని బస్తాలు కిందపడ్డాయి. లారీ వెనుకాల వాహనాలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



లారీలో నుంచి కింద పడ్డ ధాన్యం బస్తాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు, సిబ్బంది

## విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

లింగంపేట, మే 2: విద్యుత్ ప్రమాదాలు తగ్గించడానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో డీఈఈ విజయసారథి అన్నారు. లింగంపేటలోని విద్యుత్ సబ్ స్టేషన్లో విద్యుత్ భద్రత వారోత్సవాల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఐఎస్ఐ మార్కు కలిగిన విద్యుత్ పరికరాలు ఉపయోగించాలని, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తితే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఈ మల్లేశ్, సబ్ ఇంజినీర్లు అశోక్, భాస్కర్‌తోపాటు విద్యుత్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.



కారు తనిఖీ చేస్తున్న పోలీసులు

## పెండింగ్ చలాన్లు చెల్లించాలి

లింగంపేట, మే 2: మండలంలోని నల్లమడుగు గ్రామ రహదారిపై స్థానిక పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను పరిశీలించి, వెంటనే చెల్లించాలని లేని పక్షంలో వాహనాలను సీజ్ చేస్తామని వాహనదారులను హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. హెల్మెట్ లేని కారణంలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. హెల్మెట్ ధరించని పది మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు ప్రొబేషనరీ ఎస్సై రాఘవేందర్ తెలిపారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది జయ్, కాశాగౌడ్, మదన్‌లాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మద్నూర్‌లో ముస్లిముల ర్యాలీ



ర్యాలీ తీస్తున్న ముస్లిములు

మద్నూర్, మే 2: పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ మద్నూర్‌లో ముస్లిములు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక జామా మసీదు నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దేశంలో ఉగ్రవాదానికి చోటులేదని, అందరూ కలిసికట్టుగా ఉగ్రవాదాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చా రు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. జావేద్‌పటేల్, షకీల్, హైమద్, బాబా, సూఫీ, సాయిలు, విజయ్‌కుమార్, లక్ష్మణ్, కృష్ణ పాల్గొన్నారు.